ఇంటర్వ్యూ మొదలైంది, అరగొండ వెంకట్రావ్, ఆండాళ్ళు కాస్తంత ఆందోళనగా కూర్చున్నారు.

"బాబు నీ పేరేంటి?" అడిగింది ఇరవై ఆరేళ్ళ హెచ్.ఎమ్ రోజలిన్.

"యాక్‌నోకియా" చెప్పాడు మూడేళ్ళ బన్నీ

"యాక్?" అదేం పేరు?"

"యజ్ఞవల్క్య అండీ, నోరు తిరక్క... పాపం చిన్న పిల్లాడు కదండీ ?"

అరగొండ సమర్థించాడు కొడుకుని మురిపెంగా చూసుకుంటూ 'నోరు తిరగని పేర్లు పెట్టడం ఎందుకో, మమ్మల్ని చంపటాన్కి కాకపోతే, అన్నట్లు ఓ చూపుచూసి పైకి మాత్రం

"మంచిపేరు" అంది రోజీ ఆపై "మీ మమ్మీ పేరు చెప్పమ్మా?" అడిగిందామె ముద్దు ముద్దుగా ముద్దు చేస్తూ

"అమ్మ"

# యాక్ నోకియా



హార్థిక

"పేరమ్మా ? పేరు.... నేమ్ చెప్పు"

వినిపించుకోకుండా టేబుల్ పైకెక్కి గ్లోబ్ తిప్పుతూ కిలకిలా నవ్వుతున్న బన్నీని లాక్కొని బలవంతంగా వొళ్ళో కూర్చోబెట్టుకుంది ఆండాళ్ళు. వాడు కోతిలాగా గింజుకుంటూ అల్లరిచేస్తున్నాడు. తండ్రి ఇబ్బందిగా కదిలాడు.

"సరే మీ డాడీ మమ్మీని ఏమని పిలుస్తారో చెప్పు?"

"ఏమేవ్, తట్టాయ్, పంకిన్ (పంప్‌కిన్ - గుమ్మడికాయ కొచ్చిన తిప్పలు) కోపంతో కసిగా చెప్పాడు (తిట్టాడు) బన్నీ, తనని గ్లోబుతో ఆడుకోనివ్వనందుకు నిరసనగా. తలపట్టుక్కూర్చున్నాడు అరగొండ. మొహం పాలిపోయి, పెదవులదురు తుండగా మహానటి సావిత్రిని మరిపిస్తూ, కళ్ళతోనే (దూ) భాషిం చింది ఆండాళ్ళు అరగొండతో... "రాత్రికి అయి పోయావ్" అన్నట్లు.

"ఇంకా ఏమని పిలు స్తారు?" నవ్వాపుకుంటూ ప్రస న్నంగా అడిగింది రోజీ, సీక్రెట్‌గా ఫైవ్‌స్టార్ చాక్లెట్ చూపించాడు వెంకట్రావ్

## నువ్వూ - నేనూ ఒకటే

నువ్వనేదీ
నేననేదీ ఒకటే -
నేను సూర్యుడంటాను
నువ్వు సూర్యనారాయణుడంటావు
నేను వర్షమంటాను
నువ్వు వానదేవుడంటావు
నేను చల్లగాలంటాను
నువ్వు వాయుదేవుడంటావు
నువ్వనేదీ
నేననేదీ ఒకటే -
నువ్వు 'వాస్త'ంటావు
నేను 'నాస్త'ంటాను
నువ్వు కర్మ ఫలమంటావు.
నేను కష్టఫలమంటాను
నువ్వు హృదయాన్ని రాయి చేసి
రాయి రప్పని దేవుణ్ణి చేస్తావు.
నేను దేవుడిలాంటి మనిషికి
ప్రేమ జాలి దయాగుణం గల ఆ మనిషికి
వంగి దణ్ణం పెడతాను
నువ్వనేదీ నేననేదీ
ఒకటే -
కాకపోతే
ఎక్కడో అగాధ అంతరంగంలో
నా హేతుబద్ధతకీ
నీ భక్తి శ్రద్ధలకీ
వెంట్రుకలో వెయ్యోవంతు వైరం
నువ్వనేదీ ఒకటే.
నేననేదీ ఒకటే.
కాకపోతే -
మనిద్దరం ఎప్పుడూ
తర్కపుటద్దంలో
తమాషాకైనా తొంగిచూసుకోవద్దు -
పిడివాదనల పలుకురాళ్ళతో
జీవితానందాన్ని ముక్కలు ముక్కలు చేసుకోవద్దు -
నువ్వయినా నేనయినా
ఎప్పటికయినా
పొరపొచ్చాల్ని పక్కనబెట్టి
పరమసత్యం ముందల
ప్రణమిల్లాల్సిందే -

పి. శ్రీనివాసగౌడ్

"బంగారం, చిన్నీ, చంటి, బుజ్జి..." అంటూ ఓ ముద్దిచ్చాడు తల్లికి బన్నీ ఆమె మొహం వెలిగిపోయింది. తండ్రి రిలీఫ్‌గా ఫీలయ్యాడు. జెలసీతన్నుకొచ్చి రోజీ చిరాకుపడింది.

"పిల్లలకి కనీసం పేర్లు నేర్పరా?" ఉరిమిందావిడ.

"వాడికి మాటలు సరిగా రావు మేడమ్ కానీ బాగా చదువుతాడు, పాటలు పాడుతాడు".

'చెవిలో క్యాబేజీ పూలు కన్పడుతున్నాయా?' అన్నట్లు చూసి

"అక్కడేం రాసుందో చదువుబాబు" అంటూ ఎబిసీ చార్ట్ చూపించింది రోజీ. బన్నీ అమ్మ ఒళ్ళో నుండి దూకి చార్టు దగ్గరికి పరిగెట్టి

"ఎ ఫర్ ఏపిల్, బి ఫర్ బాయ్.... జెడ్ ఫర్ జీబ్రా".... గడగడ చదివేశాడు.

"మరి ఆ చార్టులో?"

"ఓఎన్ఈ వన్, టి డబ్ల్యూఓ టూ.... టిఇఎన్ టెన్".... మళ్ళీ గడగడ

✿ ✿ ✿

"ఇందాక మాటలు రావన్నారు? బాబు అన్నీ చదువు తున్నాడు?"

"అదే అర్థం కావడంలేదు మేడమ్"

"మీరేమన్నా కావాలంటే ఎలా అడుగుతాడు?"

"అదీ, అదీ అని సైగలు చేయటమో లేదా ఏంటది, ఏంటదీ? అని నసపెట్టడమో"

"డాక్టర్‌కి చూపించకపొయ్యారా?"

"అవసరమైనవి మాట్లాడి, మిగిలినవన్నీ సైగలతో, ఎమోషన్‌లతో సాధించుకున్నాడంటే, తెలివైన బుడ్డోడు, సంతోషంగా ఉండండి, వెళ్ళండని పంపేశారు."

"శఠగోపం స్వామీజీకి చూపించాను మేడమ్" ఉత్సాహంగా అంది అండాళ్ళు

"ఆయనేమన్నారు?"

"మితభాష్యం వంటికి, పంటికి మంచిదని సెలవిచ్చారు" అందుకున్నాడు వెంకట్రావ్.

"వంటికి, పంటికా ? అదేంటి?"

"ఎక్కువగా మాట్లాడేవాడు, ఎక్కువగా కమిటై ఉల్లుగాడవు తాడని ఆయనుద్దేశ్యం."

"అది ఆయన ఉద్దేశ్యమా లేక మీ ఇంటర్ ప్రెటేషణా?" (భాష్యమా?)?

"స్వానుభవం, ఎక్స్‌పీరియన్స్."

"స్వామీజీదా, మీదా?"

"ఇద్దరిదీ, ఆయనవన్నీ కట్టుడు పళ్ళు, నేను బ్యాంక్ రఫ్ట్."

"అవునవును, అనుభవం ఒక కఠినమైన అధ్యాపకురాలు, జెల్లకొట్టి మరీ నేర్పుతుంది" రోజి అంది స్థిరంగా

"అవునవును"........ బెత్తంతో బెదిరిస్తున్న టీచర్ ముందు అల్లరి పిల్లాడు బుద్ధిమంతుడ్లా నటించినట్లు తలూపాడు అరగొండ.

"ఇంతకీ స్వామీజీ అనుభవాలు మీకెలా తెలుసు?"

"ఆయన, స్కూల్లో, నాకు సీనియర్, ఎలక్యూషన్‌లో ఎప్పుడూ ఫస్ట్ పెద్దయి పెళ్ళయిన తర్వాత పెళ్ళాం ముందు తెలివితేటలు ప్రదర్శిం చాడు. జీవితంలో మొదటిసారి ఖంగుతిన్నాడు. విషయమేమిటంటే ఆమె నోరు విప్పితే ఎదుటివాడు ఎంతటి వాడైనా సరే వైరాగ్యం వచ్చేస్తుంది. అదీ ఆమెకున్న పవర్. ఇక ఇంటగెలవ లేక ఊరిమీద పడ్డాడు. సిద్ధాంత రాద్ధాంతాలు, చేసేవాడు. హిత వచనాలు పలికేవాడు, ఆర్గ్యుమెంట్లు చేసేవాడు. చివరికో రోజు తెలుసుకున్నాడు."

"ఏమని ?"

"ఒన్ కెన్ నెవ్వర్ విన్ త్రూ ఏన్ ఆర్గ్యుమెంట్ అని, ఇంట్లోనైనా, బయటైనా

సూత్రం మారదని."

"మంచిదేగా?"

"అయితే అప్పటికే వాగీ వాగీ తిరుక్షవరమయ్యి, ఫలితంగా పెళ్ళాంతో తన్నులు తిని, బొక్కబోర్లాపడి పళ్ళురాలి, ఫైనల్‌గా రోడ్డున పడి స్వామీజీ అయ్యాడు. అప్పటినుంచి అందరికీ ఓ నిజం చెప్తుంటాడు..."

"ఏంటా నిజం ?"

సైలెన్స్ ఈజ్ అన్‌సీజింగ్ ఎలక్వెన్స్"

"రమణ మహర్షి బోధనలా ఉంది?"

"అయ్యుండొచ్చు. స్కూల్లో కూడా బాగా కాపీ కొట్టేవాడు"

"మా స్కూల్లో కాపీ నిషిద్ధం".... తడుము కుంది రోజీ.

"మా బన్నీ నో కాపీ, సర్వస్వతంత్రంగా ప్రవర్తిస్తుంటాడు. అన్ని తనకు తానే నేర్చుకుంటాడు... సీతయ్యలాగా"

"ఆయనెవరు?"

"వాడి ఫేవరెట్.... సీతయ్య ఎవరి మాట వినడు... అదీ వాడి ఫిలాసఫీ"

✿ ✿ ✿

"బాగుంది ఇక స్కూల్లో చేర్చటం ఎందుకు తీసుకుపోండి."

"మేడమ్ ప్లీజ్, అలా అనొద్దు". బ్రతిమాలు తున్నట్లు కాక వీడిగోల ఇంట్లో భరించలేకపోతున్నాం అన్న భయం ధ్వనించింది ఆండాళ్ళు గొంతులో.

"ఎలా అండీ కమ్యూనికేట్ చేయడం? చదు వెలా వస్తుంది?"

"చదువు ఇంటి దగ్గర మేం నేర్పుకుంటాం ప్లీజ్" అరగొండ అందుకున్నాడు.

"మరి మేమేం చెయ్యాలి?"

"గడగడా మాట్లాడేటట్లు చేయండి చాలు"

"ఆఁ? అదెలా?"

"పిల్లల మధ్య పడితే వాడే నేర్చుకుంటా డ్లేండి, ప్లీజ్ స్కూల్లో, ప్లీజ్ స్కూల్లో చేర్చుకోండి ప్లీజ్" ఆండాళ్ళు బ్రతిమలాడింది.

"కుదరదండి"

"ప్లీజ్ మేడం ప్లీజ్, మాది ఉమ్మడి కుటుం బం వీడొక్కడే వంశాంకురం. ఇంట్లో రకరకాల టీవీ ఛానెల్స్ చూసిన కన్‌ఫ్యూషన్‌లో మాటలు రావడం లేదు...." అంది ఆడిపోసుకుంటున్నట్లుగా ఆండాళ్ళు.

"అదేంటి?"

"మరి ఇంట్లో ఆడోళ్ళందరూ పిల్లాడ్ని ఒళ్ళో కూర్చోబెట్టుకొని మాటలు నేర్పడాన్కి బదులు టీవీలకతుక్కుపోయి పిల్లల్ని అలక్ష్యం చేస్తే జరిగేదిదే.... మనిషికో భాష ఛానల్ చూస్తుంటే పసిపిల్ల లేదని ఫాలో అవుతారు?" అసలు రహస్యం బయటపెట్టాడు అరగొండ వెంకట్రావ్.

"ఓహో ! టీవీ బాధితులన్నమాట."

"అవును మేడం బంగారం లాంటి పిల్లాడు కాస్త 'బన్నీ ద గిబ్బర్ మేన్' ఐపోయాడు."

"గిబ్బర్‌మేన్ ? సూపర్‌మేన్, స్పైడర్‌మేన్‌లా! కొత్త కార్టూనా ?"

"కాదు మేమ్, గిబ్బరిష్‌గా,అంటే అర్థం కాకుండా కూతలు కూసే వాళ్ళనలా అంటారు"

"కొత్తపదం నేర్చుకున్నాన్నివ్వాళ్ళ...సరే..... అంతగా బ్రతిమలాడుతున్నారు కాబట్టి, ఒకపని చెయ్యండి, వారం టైం ఇస్తాను..... ఈలోగా ఇంట్లో వాళ్ళ పేర్లు నేర్పించి తీసుకురండి.... అలాగే ఫీజుతో పాటు బిల్డింగ్ ఫండ్ ఓ పాతికవేలు కూడా తెచ్చుకోండి."

"ఆఁ ! ఐదువేలే కదండి!" సణిగాడు అరగొండ.

"మీ వాడు అందరికంటే తెలివైన వాడు కద, పైగా ఎవరికీ అర్థం కాకుండా మాట్లాడతాడని అంటున్నారు, అందుకని"

"కాని వాడు ఎక్కువ మాట్లాడడు కదా ?"

"అయితే ?"

"వాగేవాడు నష్టపోతాడు, వినేవాడు లాభపడ్తారని కదా సిద్ధాంతం"

"ఇప్పటివరకు ఎవరు ఎక్కువ మాట్లా డింది?" అని నవ్వుతూ చురకంటించింది రోజీ.

"ఆఁ !" అని నోరు తెరిచాడు అరగొండ

"సూత్రాలు కాదు. అనుభవాలు గుర్తుంచు కోవాలి." కసిగా తొడపాశం పెట్టింది ఆండాళ్ళు, రోజీ చూడకుండా.....

"ప్రతీదీ లైట్‌గా తీసుకుంటే ఇంతేనను కుంటా"...... గొణుక్కుంటూ కాసేపు తలగోక్కొని, "కానీ విషయం మావాడు కదాండి ?" అన్నాడు వెంకట్రావ్ ఉత్సాహంగా పెద్ద పాయింట్ దొరికినట్లు సంబరపడిపోతూ.

"ఫీజు కట్టేది మీరు కదా !" అంది కొంచెం కటువుగా రోజలిన్. ఆమె గొంతులో "నీ లాజిక్ నా దగ్గరా' అన్న విరుపు, చూపులో "నోర్మూసుకొని చెప్పింది చెయ్', అనే అధికారం, కూర్చున్న విధా నంలో (బాడీ లాంగ్వేజిలో) 'బీ డిసిప్లిన్డ్ బాడ్‌బోయ్', అన్నట్లనిపించి, మైండ్‌బ్లాంక్ కాగా, రక్కున శరగోపం స్వామి గుర్తుకొచ్చి వైరాగ్యం కమ్ముకొచ్చి మౌనంగా బయటకు నడిచాడు కొడుకునెత్తుకొని ఉసూరు మనుకుంటూ అరగొండ ఆ వెనకే ఆండాళ్ళు.....

✿ ✿ ✿

తమ్ముడు కృష్ణారావుతో తన గోడు వెళ్ళ బోసుకుంది ఆండాళ్ళు..

"మరేం ఫర్వాలేదు, నాకొదిలేయ్ అక్కా ! ధైర్యంగా ఉండు..." అంటూ మేనల్లుడ్ని ఎత్తుకొని ముద్దులాడాడు కృష్ణా....

"రారా ! అల్లుడా ! తోడరమల్లుడా ! వీరగల్లుడు నేర్పిస్తాను నీకు."

వారం తరువాత......

"శుభోదయం మేడం, ఇంటర్వ్యూకి వచ్చాం" అన్నాడు కృష్ణా, పండ్లు పూలు టేబుల్ మీద పెట్టి

"ఇదేంటి గుడికొచ్చినట్లు," కొంచెం చిరాకు


## శ్రీశ్రీ సాహిత్య పురస్కారం - 2007

**ఉత్తమ కథ, ఉత్తమ వ్యాసం, ఉత్తమ కవిత, ఉత్తమ మినీ కవిత**

**శ్రీశ్రీ సాహిత్యనిధి తరపున శ్రీశ్రీ సాహిత్య పురస్కారం - 2007కు రచనలు పంపండి.**

నిబంధనలు :1.2007 సం॥లో అచ్చయిన రచనలు మాత్రమే ప్రచురణ వివరాలతో మూడు జిరాక్సు కాపీలు పంపాలి. 2.ప్రగతిశీల రచనలు మాత్రమే పోటీకి అర్హమైనవి. 3. న్యాయనిర్ణేతలదే తుదినిర్ణయం. ఇందు నిమిత్తం ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు అనుమతి లేదు. 4. శ్రీశ్రీ సాహిత్య పురస్కారానికి ఎటువంటి నగదు బహుమతి ఉండదు. అభినందన పత్రం, జ్ఞాపిక, సత్కారం మాత్రమే ఉంటాయి. అవి శ్రీశ్రీ జయంతి సభలో ఇవ్వబడతాయి. 5. రచనలు శ్రీశ్రీ సాహిత్య నిధి చిరునామాకే పంపాలి. 6. రచనలు 31 - 1 -2008 లోగా అందాలి.

**సింగంపల్లి అశోక్ కుమార్,** కన్వీనర్,

**శ్రీశ్రీ సాహిత్య నిధి,** 305, ప్రగతి టవర్స్, మారుతీనగర్, విజయవాడ-520 004.

ఫ్యాక్స్ : 0866-6697375,ఫోన్ : 0866-6617375, సెల్ : **98485 04649,** E.mail:srisri_sahityanidhi@yahoo.com

పడింది రోజీ.

"ఐడీ, గుడీ ఒక్కటే కదా మేడం ? పైగా హెడ్ మిస్ట్రెస్ సాక్షాత్తు సరస్వతీ దేవితో సమానం".... "మేడం కాళ్లకు దణ్ణం పెట్టు బన్నీ" వాడు బుద్ధిగా ఆ పనిచేశాడు.... ఆమె చిరాకు మాయమయ్యి చిరునవ్వు దర్శనమిచ్చింది.

"ఇంతకీ మీరెవరు?"

"నేను వీడి మేనమామను మేడమ్, కృష్ణారావు అంటారు నన్ను"

"అరగొండ దంపతులు ఏమయ్యారు?"

"గడచిన ఇంటర్వ్యూ రోజు రాత్రి ఓ మహత్తరమైన సంఘటన జరిగింది మేడమ్"

"మహత్తరమైన సంఘటనా?"

"అవును మేడమ్, అనుభవం జెల్లకొట్టి నేర్పిస్తుందని తమరు సెలవిచ్చారటగా?"

"అవును, అది నిజమే కదా !"

"అయితే జెల్లకొడ్తేనే అది అనుభవమనీ, బొప్పికడ్తే గానీ అనుభవించింది గుర్తుండదనే బ్రహ్మాండమైన తర్కం దానిలో గోచరించింది మా ఆండాళ్ళక్కకి"

"ఇదేదో బాగుందే"

"కదా ! ఆరోజు రాత్రి తనని పంప్‌కిన్‌తో పోలుస్తున్నందుకు ఒకటి, తట్టాయ్ అని తిక్కతిక్కగా తిడుతున్నందుకు రెండూ, మీ వంటి జ్ఞానులతో వితండవాదన చేసినందుకు మూడు, మొత్తం ఆరు టెంకె జెల్లలు ఇచ్చింది ఆండాళ్ళక్క అరగొండ బావకి"

"అయ్యో !"

"తలంతా బొడిపెలతో సైన్స్‌ఫిక్షన్ సినిమాలో అంతరిక్షజీవిలా తయారయ్యాడు పాపం బావ."

"అవునా !" కిలకిలా నవ్వింది రోజీ.

"ఆ మరేనండీ, తిక్కరేగితే ఎంత లాజిక్కయినా మటాష్ ఐపోతుంది కదాండీ?"

'అవునవును' తలూపింది నవ్వాపుకుంటూ రోజీ.

"ఈ విషయం గుర్తించి జ్ఞానోదయం అయ్యి కాబోలు, బావ అప్పట్నించి మౌనానంద స్వామి అయ్యాడు. ప్రాయశ్చిత్తంగా అక్క (పనిలో పని సన్నబడొచ్చు అనుకొని !) తిండి మానేసి డైటింగ్ ప్రారంభించింది."

"మంచిదేగా !"

"రెండు రోజులు బానే ఉందండి, ఆ తర్వాతే అసలు సమస్యలు ఆరంభమయ్యాయి."

"ములక్కాయ్ అని పిలవటం మొదలెట్టారా ఏంటి? మీ అక్కని".

"కాదండి అడిగితే కాని అమ్మైనా పెట్టదంటారు కదండి."

"అవునవును కదా !"

"టీవీలు వచ్చిన తర్వాత అరిచి గీపెడ్తే కానీ అమ్మైనా పెట్టదని మారిపోయిందండా సామెత. అక్క తిండి మానేసి డైనింగ్ హాల్ మొహం చూడటం లేదు కదాండి, పాపం బావేమో మౌనవ్రతం.... అరవటం కాదు కదా ! అడగటం కూడా నిషిద్ధమాయె, టీవీరంధిలో పడి ఆయన సైగలు పట్టించుకునేవారే కరువయ్యారు.... ఈ విధంగా తిండి మానేసి అక్క, వడ్డించేవాళ్ళు (పట్టించుకొనేవాల్ళు) లేక బావ, ఇద్దరూ నిన్ననే హాస్పిటల్ పాలయ్యారు.... భలే దొరికారనుకుంటూ, అయిదు వేలు గుంజి సెలైన్ పెట్టి ఇవ్వాళ్ళే డిస్చార్జ్ చేసారు. ఇదండి బన్నీని నేను తీసుకురావలసి రావటం వెనుక కథ"

"ఇంత కథ జరిగిందా ! అయామ్ సారీ"

'మీరెందుకండి సారీ చెప్పటం అంతా మా బావదే తప్పు, పైత్యం కాకపోతే చదువు నేర్పేవాళ్ళకే సిద్ధాంతాలు బోధిస్తారాండి ఎవరైనా?"

"ఏమో ? నాకైతే "ఎనోనిమిటి ఈజ్ హ్యూమిలిటి', అన్నట్లు అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్లు ఉండటమే ఇష్టం..." కాసింత గర్వంగా అంది రోజలిన్.

"అరే మన అభిప్రాయాలు చక్కగా కలిసిపోతున్నాయే... అన్నట్లు ఓ చిన్న కాంప్లిమెంట్ ఇవ్వొచ్చాండి?....." సమాధానంగా సిగ్గుపడింది రోజీ.

"ఈ చీర మీకు బాగా నప్పిందండి ! రవ్వల నక్లెస్ కూడా బాగా మ్యాచ్ అయ్యింది. చార్మిలా చార్మింగ్‌గా వెలిగిపోతున్నారు.... నాకో డౌట్."

"థాంక్యూ.... అడగండి"

"అసలు చీరకే మీరు కట్టడం వల్ల అందం వచ్చిందని నా అభిప్రాయం ఏమంటారు?"

"ఇక ఇంటర్వ్యూ ప్రారంభిద్దామా?" అందావిడ పొంగి వరదై పారుతున్న ఆనందం తట్టుకోలేక చిరుకోపం నటిస్తూ.

"అయ్యో మీకు కోపం తెప్పించినట్లున్నానే కాస్తంత నవ్వండి ప్లీజ్, లేదంటే ఆ టేబుల్ పైన పూలు చిన్నబోతాయ్".

"భలేవారే, కవిత్వం బాగానే చెబుతున్నారు!"

"సరస్వతీ దేవి ఎదురుగా కూర్చుంటే ఎంత మందమతైనా పండితుడు కాడాండీ?"

"మాటలు బానే చెబుతున్నారు. ఇంతకీ పిల్లాడికి నేనడిగింది బాగా నేర్పారా?"

"మాటలదేముందండీ, మీ సంరక్షణలో ఇట్టే వచ్చేస్తాయి. మావాడు ఏదో చెప్తాడట.... ఇందాకటి నుంచి తెగ నస పెడ్తున్నాడు."

"ఏం బన్నీ ఏం చెపుతావ్, ఇలా రా నాన్నా," అందావిడ మురిపెంగా బన్నీ బంతిలా దూకి మెరుపులా ఒక గులాబీ పువ్వు తీసుకొని ఆమె చేతిలో పెట్టి 'ఐ లవ్ యు' అన్నాడు. నవ్వాలో కోపం తెచ్చుకోవాలో తేల్చుకోలేని సంభ్రమంలో ఆమె చిరుకోపంగా చూసింది. తన చివరి బాణం ప్రయోగించాడు కృష్ణా.

"టీవీ, సినిమాల ప్రభావం మేడమ్. ఏమను కోకండి. అందమైన ఆడాళ్ళను చూస్తే మావాడు ఇలానే చేస్తాడు...."

"వేషాలూ....." అంది రోజీ ముద్దు ముద్దుగా సిగ్గుపడిపోతూ.

✿ ✿ ✿

అడ్మిషన్ అయ్యింది. బిల్డింగ్ ఫండ్ అయిదు వేలు మాత్రమే బన్ని (ఆడ) టీచర్లందరికీ ప్రియ శిష్యుడు. కృష్ణారావు స్కూలు ఫంక్షన్లన్నింటికి ముఖ్య అతిథి. అరగొండు బామ్మర్ది వెంటపడ్డాడు.

"ఎలా మ్యానేజ్ చేశావో చెప్పరా" అంటూ.

"కొన్ని అనుభవం మీద తెలుసుకోవాలి బావా," కొంటెగా నవ్వాడు చిలిపి కృష్ణుడు.

"అనుభవమా ! వామ్మో !" తలమీద బొడిపెలు తడుముకొన్నాడు.

అరగొండ వెంకట్రావ్ భయంభయంగా....

## బౌలింగ్‌లో ప్రపంచరికార్డు

శ్రీలంక క్రీడాకారుడు ముత్తయి మురళీధరన్ టెస్టు క్రికెట్‌లో 709 వికెట్లు తీసుకుని ప్రపంచంలోనే అత్యంత వికెట్లు తీసుకున్న బౌలర్‌గా రికార్డుకెక్కాడు. ఇప్పటివరకూ ఆస్ట్రేలియా క్రీడాకారుడు షేన్‌వార్న్ పేరిట (708 వికెట్లు) ఈ రికార్డు ఉంది. ఇంగ్లాండు బ్యాట్స్‌మేన్ పాల్‌కాలింగ్ ఉడ్ వికెట్‌ను తీసుకోవడం ద్వారా మురళీధరన్ ఈ రికార్డును సృష్టించాడు. షేర్‌వార్న్145 మ్యాచ్‌ల్లో 708 వికెట్లు తీసుకోగా మురళీధరన్ 116 మ్యాచ్‌ల్లోనే దానిని అధిగమించారు.